
జిల్లా జైలు కోసం ప్రతిపాదిస్తున్న భూదాన్ భూముల స్థలం

# జిల్లా జైలు మునిగినా పర్లేదా!

**ఎంసీహెచ్ మునుగుతుందని ఐబీలో హాస్పిటల్ కడుతున్నరు**

- మరి ఆ ముంపు ప్రాంతం జైలుకు ఎలా కేటాయిస్తారు
- వరదలు వచ్చినప్పుడు ఖైదీలను తరలిస్తారా..?

మంచిర్యాల, డిసెంబర్ 10(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల జిల్లా కోసం గుర్తించిన భూమిపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. గర్మిళ్ల శివారు కాలేజీ రోడ్‌లో భూదాన్ భూములున్న సర్వే నంబర్లు 707లో 2.30 ఎకరాలు, 708లో 9.10 ఎకరాలు జైలు కోసం గుర్తిస్తూ ఎంఆర్వో మంచిర్యాల ఆర్డీవో, కలెక్టర్‌కు నివేదిక సమర్పించారు. ఇదే సర్వే నంబర్ 708లో ఓ పక్కన మాతాశిశు ఆసుపత్రి(ఎంసీహెచ్) ఉంది. 2022లో వందేళ్ల చరిత్రలోనే ఎప్పుడూ లేనంత భారీ వరదలు రావడంతో మంచిర్యాల పట్టణం సగం మునిగింది. ఈ క్రమంలో ఎంసీహెచ్ సగం మునిగిపోవాల్సి వచ్చింది. అప్పటి నుంచి గడిచిన రెండేళ్లుగా వరదల సమయంలో ఎంసీహెచ్‌ను ఖాళీ చేయించి పేషెంట్లను జీజీహెచ్‌కు తరలిస్తున్నారు. 2018లో ఎన్నికల కోడ్ అమల్లో ఉండగానే అధికారులు ల్యాండ్ గుర్తించి పనులు మొదలుపెట్టారు. దీనిని స్థానిక బీఆర్ఎస్ నాయకుల ఫెయిల్యూర్‌గా కాంగ్రెస్ నాయకులు దుష్ప్రచారం చేశారు. అధికారంలోకి వచ్చాక ఎంసీహెచ్ మునిగిపోతుందనే కారణం చూపించి ఐబీ చౌరస్తాలో నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను కూల్చివేసి మరీ కొత్త ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా ఇప్పుడు ఎంసీహెచ్ పక్కనున్న స్థలాన్ని జిల్లా జైలుకు కేటాయించేందుకు సమాయత్తం అవుతున్నట్లు తెలిసింది. మరి ఆసుపత్రి మునిగినప్పుడు అదే స్థలంలో జైలు వస్తే అది కూడా మునగదా.. అది మునిగితే అక్కడ కాదని మరో దగ్గర జైలు కట్టిస్తారా అనే చర్చ నడుస్తున్నది. పోనీ జైలు కట్టాక ఆ స్థలంలోకి వరద నీరు రావా.. ఒక వేళ వరదలు వస్తే ఆసుపత్రి నుంచి పేషంట్లను తరలించినట్లు జైలు నుంచి ఖైదీలను తరలిస్తారా..తరలిస్తే ఎక్కడికి తరలిస్తారు. ఆక్రమంలో ఒకవేళ ఖైదీలు పారిపోతే బాధ్యులు ఎవరు అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

## మెడికల్ కాలేజీకి.. కలెక్టర్ ఆఫీసుకు పనికిరాని భూమి..


ఇప్పుడు జిల్లా జైలు కోసం ప్రతిపాదిస్తున్న భూమి గోదావరి ఒడ్డుకు కేవలం 500 మీటర్ల దూరంలో వస్తుంది. ఇదే స్థలం గతంలో మెడికల్ కాలేజీ, కలెక్టర్ కార్యాలయ నిర్మాణాల కోసం స్థల పరిశీలన చేశారు. కానీ.. అప్పుడున్న ఆర్అండ్‌బీ అధికారులు ఈ స్థలం కట్టడాలకు అనుకూలం కాదని చెప్పారు. దీంతో కలెక్టరేట్ నస్పూర్‌కు, మెడికల్ కాలేజీ గుడిపేటకు తరలించారు. ఆ నిర్మాణాలను పని చేయని భూమిని జైలు కేటాయించడం ఏంటన్నది అర్థం కావడం లేదు. పైగా జిల్లా జైలు నిర్మాణానికి 25 ఎకరాలు కావాలని జైళ్ల శాఖ కోరింది. ఇదే సర్వే నెంబర్ 708లో ఇప్పుడు గుర్తించిన 9.10 ఎకరాలు కాకుండా దాని పక్కనే మరో 10 ఎకరాలు ఉంది. దాన్ని ఆనుకుని ఉన్న 707లోనూ కొంత భూమి ఉంది. అంటే జైళ్ల శాఖ అడిగిన 25 ఎకరాలు కూడా ఇవ్వడానికి ఆస్కారం ఉన్నప్పటికీ కేవలం 12 ఎకరాలే ప్రతిపాదించారు. దీనికి గల కారణాలు ఏంటన్నది తెలియరావాల్సి ఉంది.

### జైలుకు వేరే దగ్గర స్థలం కేటాయించాలి



కరకట్ట కట్టేది రాళ్లవాగుకు. గోదావరికి కాదు. గతంలో వచ్చినట్లు భారీ వరదలు భవిష్యత్తులో రావా. అప్పట్లో పేషంట్లను తరలించారు. ఇప్పుడు జైలు కడితే ఖైదీలను తరలిస్తారా. నిర్మాణానికి ఏ మాత్రం పనికిరాని ఈ స్థలాన్ని జైలుకు కేటాయించొద్దని మంచిర్యాల ఆర్డీవో నుంచి తెలంగాణ సీఎం వరకు ఫిర్యాదు ఇచ్చాం. మరో చోట అనువైన స్థలాన్ని గుర్తించి జిల్లా జైలు నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలి. అలాగే కబ్జాకు గురైన భూదాన్ భూములను రక్షించేలా స్థలం చుట్టూ కంచె ఏర్పాటు చేయాలి.

**- నయీం పాషా, సామాజిక కార్యకర్త**


ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మికి వినతి పత్రం అందజేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

# సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్య పరిష్కరించాలి

**ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి**

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, డిసెంబర్ 10: విద్యా శాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి డిమాండ్ చేశారు. మంగళవారం ఆసిఫాబాద్‌లో కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు చేపట్టిన నిరసన దీక్షకు ఆమె మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు ఇచ్చిన వినతి పత్రాన్ని స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలో సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఇచ్చిన హామీని నెరవేర్చడంలో విఫలమయ్యారన్నారు. ఇప్పటికైనా వారి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలలని డిమాండ్ చేశారు. సమ్మెకు మద్దతు తెలిపిన వారిలో ఉపాధ్యాయ సంఘాలు యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతి కుమారి, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు లతీఫ్, పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చునార్కర్ అనిల్ కుమార్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు శృతిక, ప్రధాన కార్యదర్శి పవార్ తుకారాం, గౌరవ అధ్యక్షుడు కొప్పుల మోహన్, కోశాధికారి బోయిని నాగేశ్ యాదవ్, మీడియా ప్రతినిధి గేడెకర్ సంతోష్, కేజీబీవీ ప్రత్యేకాధికారి పద్మ, కార్యదర్శి దుర్గం సందీప్, రాజేశ్, అధికార ప్రతినిధి పవన్, సీసీవో అధ్యక్షుడు అనూప్, ఏంఐఎస్ ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, ఐఈఆర్పీ అధ్యక్షుడు వెంకటరమణ, పీటీఐ అధ్యక్షుడు సత్యనారాయణ, మెసెంజర్ అధ్యక్షుడు సంతోష్, డీపీవో సిబ్బంది రాము, మల్లేశ్ పాల్గొన్నారు.

## క్రమశిక్షణ, నీతి నిజాయితీతో విధులు నిర్వర్తించాలి

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 10: ఉన్నత చదువులు చదివి ఎన్నో సవాళ్లను ఎదుర్కొని పోలీస్ శాఖలో ఉద్యోగాలు సాధించిన కానిస్టేబుళ్లు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా నీతి నిజాయితీ, కమ్రశిక్షణతో విధులు నిర్వహించాలని రామగుండం కమిషనర్ శ్రీనివాస్ సూచించారు. మంగళవారం నూతన సాయుధ దళ (ఏఆర్) కానిస్టేబుళ్లతో సమావేశం నిర్వహించారు. క్రమశిక్షణ తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు. అధికారులు సూచనలు పాటిస్తూ తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. విధుల పరంగా ఎలాంటి సమస్యలు తలెత్తినా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సంబంధిత శాఖ ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

## షేక్ మక్దూంపై పీడీ యాక్టు : ఎస్పీ శ్రీనివాస్‌రావు

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, డిసెంబర్ 10: జిల్లాలోని జైనూర్ మండలానికి చెందిన ఓ మహిళపై లైంగికదాడికి పాల్పడిన షేక్ మక్దూంపై పీడీ యాక్టు నమోదు చేసినట్లు ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీడీ యాక్టు అమలు చేసేందుకు చేసిన ప్రతిపాదనకు ప్రభుత్వం ఏర్పా టు చేసిన పీడీ యాక్టు అడ్వైజరి బోర్డు సభ్యుల ఆమోదం మేరకు పీడీ యాక్టు నమోదు చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు.

## కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

బెల్లంపల్లి, డిసెంబర్ 10 : షాదీఖాన స్థలాన్ని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మైనార్టీ నాయకులు డిమాండ్ చేశారు. షంషీర్‌నగర్‌లో షాదీఖాన భవన ఏర్పాటుకు గత ప్రభుత్వం రెండు ఎకరాలను కేటాయించిందన్నారు. భవన నిర్మాణానికి మైనార్టీ శాఖ నిధులు కూడా మంజూరు చేసిందన్నారు. కొంతమంది దొంగపత్రాలు సృష్టించి కబ్జా చేశారని ఆరోపించారు.

## బహిరంగ ప్రదేశాల్లో మద్యం, డీజేలు, డ్రోన్లపై నిషేధం

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 10: రామగుండం కమిషనరేట్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, అనుమతి లేకుండా డీజేలు, డ్రోన్లు వినియోగించడంపై ఈ నెల 1 నుంచి వచ్చే నెల జనవరి 1, 20 25 వరకు నిషేధాజ్ఞలను పొడిగిస్తున్నట్లు రామగుండం సీఎం మంగళవారం ప్రకటనలో తెలిపారు. నిషేధాజ్ఞలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.


మంచిర్యాలలో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు


చెన్నూర్ : తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# తెలంగాణ అస్తిత్వంపై కాంగ్రెస్ విషం

## తెలంగాణ తల్లి విగ్రహం మార్పుపై బీఆర్ఎస్ ఆందోళన

- 'కాంగ్రెస్ తల్లి వద్దు.. తెలంగాణ తల్లి ముద్దు'అంటూ నినాదాలు
- విగ్రహాలకు పాలాభిషేకం చేసిన నాయకులు


బెజ్జూర్ : తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

కుమ్రం భీం ఆసిఫాబాద్, డిసెంబర్ 10 (నమస్తే తెలంగాణ): తెలంగాణ అస్తిత్వంపై కాంగ్రెస్ ప్రభుత్వం విషం కక్కుతున్నదని బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మార్పు చేయడంపై నిరసనగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మంగళవారం మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో ఆందోళనలు చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి విగ్రహాలు, చిత్రపటాలకు పాలాభిషేకాలు చేశారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ప్రాణాలకు తెగించి తెచ్చుకున్న తెలంగాణపై కాంగ్రెస్ పార్టీ కక్షపూరితంగా వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మార్పులు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని అసెంబ్లీ ముందు ఏర్పాటు చేయడం కాంగ్రెస్ కుట్రలో భాగమేనన్నారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణ సంస్కృతిని విధ్వంసం చేసే కుట్ర జరుగుతున్నదని ఆరోపించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తన ప్రాణాలను ఫణంగా పెట్టి తీసుకువచ్చిన తెలంగాణను, ఇన్ని రోజులు కాపాడుకున్న సంస్కృతిని కనుమరుగు చేసేందుకు రేవంత్ సర్కార్ ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. తెలంగాణ తల్లి రూపాన్ని ఎందుకు మార్చాల్సి వచ్చిందో రేవంత్ రెడ్డి సమాధానం చెప్పితీరాలని డిమాండ్ చేశారు. తెలంగాణ విలువ తెలియని, తెలంగాణ సంస్కృతి, చరిత్రపై అవగాహన లేని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇష్టం వచ్చినట్లు పాలన కొనసాగిస్తే చూస్తూ ఊరుకునేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంస్కృతిని గౌరవిస్తూ ప్రతి బతుకమ్మ పండుగకూ మహిళలకు చీరెలను కేసీఆర్ పంపిణీ చేశారని గుర్తు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ అభివృద్ధిపై దృష్టిసారించకుండా నిరంతరం కేసీఆర్‌ని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని అన్నారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చినంత మాత్రాన తెలంగాణ చరిత్రను మార్చలేరన్నారు. ఇప్పటికైనా తెలంగాణ సంస్కృతిపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న దాడి ఆపాలని లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ హైమద్, మాజీ జడ్పీటీసీ అజయ్‌కుమార్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిలువేరి వెంకటేశ్వర్లు, నాయకులు గంధం శ్రీనివాస్, భీమేశ్, రవి, సాజిద్ అన్సార్ హైమద్, నిసార్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. బెజ్జూర్ మండల కేంద్రంలో తెలంగాణ తల్లి చిత్రపటానికి బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. రెబ్బెన మండలంలోని గోలేటి గ్రామంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు పాలాభిషేకం, పంచామృతాభిషేకం చేశారు. పెంచికల్‌పేట్ మండల కేంద్రంలో తెలంగాణతల్లి చిత్రపటానికి అసెంబ్లీ కో కన్వీనర్, సమన్వయ కర్త కొండ రాంప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు బిట్టి శ్రీనివాస్, నాయకులు పాలాభిషేకం చేశారు.

### తెలంగాణ ప్రజలను అవమానించారు

**- మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు**

నమస్తే నెట్‌వర్క్, డిసెంబర్ 10: తెలంగాణ తల్లి విగ్రహ రూపాన్ని మార్చి యావత్ తెలంగాణ ప్రజానీకాన్ని కాంగ్రెస్‌పార్టీ అవమానించిందని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. మంగళవారం మంచిర్యాలలోని హమాలీవాడలో తెలంగాణ తల్లి విగ్రహానికి, బీఆర్ఎస్ నాయకులతో కలిసి పాలాభిషేకం చేశారు బతుకమ్మను చేతిలో నుంచి తీసేశారని, ఒక చెయ్యిని హస్తం గుర్తు పోలిన విధంగా ఉంచారని, కిరీటం, సిరిసంపదలు అనేవి కనబడకుండా పేదరాలిగా తీర్చిదిద్దారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ చరిత్రను కనుమరుగు చేసేందుకు ఎన్ని కుట్రలు చేసినా కేసీఆర్ దీక్షతో తెలంగాణ వచ్చిందనేది జగమెరిగిన సత్యమని తెలిపారు. చెన్నూర్ పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు 'కాంగ్రెస్ తల్లి వద్దురా....తెలంగాణ తల్లి ముద్దురా..'అంటూ నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. జన్నారం మండల కేంద్రంలోని పొనకల్ చౌరస్తాలో తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు బాలసాని శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు పాలాభిషేకం చేసి నిరసన తెలిపారు. బెల్లంపల్లి పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద తెలంగాణ తల్లి విగ్రహానికి మున్సిపల్ వైస్ చైర్మన్ సుదర్శన్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు పాలాభిషేకం చేశారు. రామకృష్ణాపూర్ పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాలాభిషేకం చేశారు.


బెల్లంపల్లి : తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు


ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# ఓ వైపు పులి.. మరో వైపు హైనా

- లేగదూడ, మేకపై దాడి
- భయాందోళనలో హుడ్కిలి, తలోడి గ్రామాల ప్రజలు

కౌటాల, డిసెంబర్ 10 : సిర్పూర్(టీ) మండలంలో హుడ్కిలి గ్రామంలో పులి.. కౌటల మండలంలోని తలోడి గ్రామంలో హైనా సంచరిస్తూ పశువులపై దాడులు చేస్తూ గ్రామస్తులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. సిర్పూర్(టీ) మండలం హుడ్కిలి గ్రామంలో మంగళవారం తెల్లవారు జామున దంద్రె రావూజీ ఇంటి ముందు కట్టేసిన లేగదూడపై పులి దాడి చేసి చంపేసింది. ఘటన స్థలంలో పులి అడుగులను అటవీ అధికారులు గుర్తించారు. కౌటాల మండలంలోని తలోడి లో మంగళవారం కొడిపే విమల తన రెండు మేకలను తీసుకుని చేనుకు వెళ్లింది. ఓ చోట మేకలను కట్టేసి చేనులో పని చేసేందుకు వెళ్లిం ది. కొద్దిసేపటికి మేకలు ఒక్కసారిగా అరవడం తో వెళ్లి చూడగా మేకపై మెడపై తీవ్రగాయమై ఉండడంతో పులి దాడి చేసేందేమోనని భయంతో విమల సొమ్మసిలి పడిపోయింది. కాసేపటి తర్వాత లేచి చూడగా మేక బావిలో పడి ఉంది. ఆమె అరుపులు విని చుట్టు పక్కల వారు వచ్చి మేకను బయటకు తీసి చూడగా అప్పటికే మేక మృతి చెందింది. పులి దాడి చేసిందనే భయంతో విమలతో పాటు చుట్టు పక్కల వారు ఇండ్లకు పరుగులు తీశారు. విషయం తెలుసుకున్న కాగజ్‌నగర్ ఎఫ్‌డీవో సాహు, సిర్పూర్ రేంజర్ ఇక్బాల్ హుస్సేన్ సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకున్నారు. దాడి చేసింది పులి కాదని హైనా అని నిర్ధారించారు. హైనాల సంచారం ఉన్నందున మేకలు, గొర్రెలు, చిన్నపిల్లలను చేలకు, అటవీ సమీపంలోకి తీసుకెళ్లవద్దని సూచించారు. ఆయన వెంట రవీంద్రనగర్ డిప్యూటీ ఎఫ్ఆర్వో హైమావతి, ఎఫ్‌బీవో ప్రభాకర్ ఉన్నారు.



తలోడి గ్రామంలో హైనా దాడిలో మృతి చెందిన మేకను పరిశీలిస్తున్న ఎఫ్‌డీవో సాహు


హుడ్కిలి గ్రామంలో పులి అడుగులు

# ఆశ కార్యకర్తల నిరసన

నమస్తే నెట్‌వర్క్, డిసెంబర్ 10 : ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు వేతనాలు పెంచాలని కోరుతూ సోమవారం హైదరాబాద్‌లోని కోఠిలో ఉన్న డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) కార్యాలయంలో వినతి పత్రం ఇచ్చేందుకు వెళ్లగా పోలీసులు దాడి చేసి, అక్రమంగా అరెస్టు చేసినందుకు నిరసనగా మంగళవారం మంచిర్యాల జిల్లాలో పలు మండలాల్లో ఆశ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. హాజీపూర్‌లోని పీహెచ్‌సీ ఎదుట నిరసన ఆశకార్యకర్తలు తెలుపగా వారిని పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నస్పూర్ పీహెచ్‌సీ వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి ఆశకార్యకర్తలు నిరసన తెలిపారు. దండేపల్లి మండలం నుంచి సీఐటీయూ పిలుపు మేరకు హైదరాబాద్ వెళ్తున్న ఆశ కార్యకర్తలను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ (బీఆర్‌టీయూ) జిల్లా కార్యదర్శి అల్లి సునీత, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఆరాల వాణి మాట్లాడుతూ కాంగ్రెస్ మ్యానిఫెస్టో, సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీల ప్రకారం ఆశ కార్యకర్తలకు రూ. 18 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళలు అని చూడకుండా చేయిపట్టి, చీర లాగడం లాంటి దుశ్చర్యలకు పోలీసులు పాల్పడడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. దాడి చేసిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


దండేపల్లి పోలీస్‌స్టేషన్‌లో అరెస్టయిన ఆశ కార్యకర్తలు